క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన కాపు సంఘం నాయకులు



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న నాయకులు

జగిత్యాల: జిల్లా మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గం ఇటీవల ఏర్పాటు కాగా, ఆదివారం ప్రమాణస్వీకారానికి రావాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపుల అభివృద్ధికి కృషి చేస్తూ ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు ఒడ్నాల రాజశేఖర్, రమణ, రాచకొండ శ్రీరాములు, పుప్పాల అశోక్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్: రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అనారోగ్యంతో బాధపడుతుండగా శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జగిత్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మరమ్మతు పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. శనివారం పలు స్కూళ్లలోని పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు, తాగునీటి సౌకర్యం, ఉచితంగా పుస్తకాలు అందించడం జరుగుతుందని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీరం రాజేశ్, సుధీర్, శేఖర్ పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫామ్స్ అందజేత



యూనిఫామ్స్ అందిస్తున్న మహిళలు

మేడిపల్లి: భీమారం మండలంలోని పాఠశాలలకు మహిళా సంఘాల సభ్యులతో కుట్టించిన ఏకరూప దుస్తులను (స్కూలు డ్రెస్) శనివారం మేడిపల్లిలోని ఎమ్మార్సీ కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారులకు అందించారు. దుస్తులను జగిత్యాల మండలం పొరండ్ల మహిళా సంఘం వారు కుట్టించి ఇచ్చినట్లు ఏపీవో అశోక్ అన్నారు.కార్యక్రమంలో జగిత్యాల ఏపీఎం గంగాధర్. సీసీలు శ్రీనివాస్,రాజు, రవీందర్, రాజేశ్వరి, ఎంఆర్సీ కోఆర్డినేటర్ రమేష్, ఆపరేటర్ రాజు, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు ప్రతిభా పురస్కారం



హెచ్‌ఎంను సన్మానిస్తున్న పీఆర్టీయూటీఎస్ నాయకులు

మల్యాల: పదో తరగతిలో తాటిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంలో కృషి చేసిన హెచ్‌ఎం కే.ఎల్.గౌతమ్ కృష్ణారావును టీఆర్టీయూటీఎస్ ప్రతిభా పురస్కారంతో సన్మానించింది. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని నిర్వహించిన సమావేశంలో హెచ్‌ఎంను శాలువతో సన్మానించి, ప్రతిభా పురస్కారం అందజేశారు.

యువకుడి రక్తదానం

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మ్యాకల రాకేశ్ రక్తదానం చేశాడు. అదే గ్రామానికి చెందిన ఓ మహిళ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా, శనివారం మెట్‌పల్లి బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రాకేశ్ రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా రాకేశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

- వాల్ ఆర్ట్‌తో సందేశాలు
- మీడియన్ ప్లాంటేషన్‌తో గ్రీనరీ పెంపు
- ఆకట్టుకుంటున్న అమర వీరుల స్మృతివనం
- పచ్చదనంతో పట్టణానికి కొత్త శోభ



హరితం ఆహ్లాదం..

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణ ఆధునీకరణలో భాగంగా చేపట్టిన హరితహారం పనులు పట్టణంలో పచ్చదనాన్ని పెంచి, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పట్టణ ప్రగతి టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన చేపట్టిన డివైడర్ ప్లాంటేషన్, ట్రీపెయింటింగ్, మీడియన్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్, అమర వీరుల స్థూపంతో కూడిన స్మృతివనం(ఉద్యానవనం) ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. డివైడర్ల మధ్య నాటిన మొక్కల గ్రీనరీతో ప్రజలకు ఆహ్లాదంతో పాటు వాహన కాలుష్యానికి చెక్ పెడుతుందని పర్యావరణ నిపుణులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచుతున్న అర్బన్ గ్రీనరీపై సండే స్పెషల్.





ఆహ్లాదానికి కేరాఫ్ అమర వీరుల స్మృతి వనం

- జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్డులో ఏర్పాటు చేసిన అమర వీరుల స్మృతివనం (ఉద్యానవనం) నిత్యం జనంతో కిటకిటలాడుతూ ఆహ్లాదానికి కేరాఫ్‌గా నిలుస్తోంది.

మీడియన్ ప్లాంటేషన్

- కొత్త బస్టాండ్ నుంచి టౌన్ హాల్ వరకు ఏర్పాటు చేసిన మీడియన్ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన ఖర్జూరా, పూల మొక్కలు రహదారిని ఆకర్షణీయంగా మార్చడంతో పాటు పొల్యూషన్‌కు అడ్డుకట్టవేస్తున్నాయి.

ట్రీపెయింటింగ్..

- హరితహారంలో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారి కిరువైపులా నాటిన చెట్లకు వేసిన ట్రీపెయింటింగ్ ప్రజలకు ఆహ్లాదం పంచుతోంది.

నిర్వహణ భేష్

- మొక్కలు నాటడమే కాకుండా వాటికి క్రమం తప్పకుండా నీరు పోయడం, మొక్కల గ్రూమింగ్ లాంటి సంరక్షణ బాధ్యతను ఎలాంటి లోపం లేకుండా చేపడుతూ బల్దియా సిబ్బంది భేష్ అనిపించుకుంటున్నారు.

అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధులు ..

- డైవైడర్లు మరియు ప్లాంటేషన్ రూ.35లక్షలు, ట్రీపెయింటింగ్ రూ. 05లక్షలు (పట్టణ ప్రగతి గ్రాంట్)మీడియన్ ప్లాంటేషన్, అమరవీరుల స్మృతివనం రూ. 90లక్షలు(పట్టణ ప్రగతి, టీయూఎఫ్ఐడీసీ)

మోడల్ సిటీగా తీర్చిదిద్దుతా



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జగిత్యాల పట్టణాన్ని హరిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం. అందరి సహకారంతో రాష్ట్రంలోనే జగిత్యాల పట్టణాన్ని మోడల్ గ్రీన్ సిటీగా నిలిపేందుకు ప్రయత్నిస్తాం.

– అడువాల జ్యోతి
బల్దియా చైర్‌పర్సన్

పచ్చదనం బాగుంది



అమర వీరుల స్మృతివనం (ఉద్యానవనం)తో పాటు జగిత్యాల పట్టణంలో గ్రీనరీ బాగుంది. పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు పలు చోట్ల హరితహారం కింద చేపట్టిన పచ్చదనం పనులు ఆహ్లాదం పంచేందుకు దోహదం చేస్తున్నాయి. కుటుంబ సభ్యులతో కలిసి సందర్శిస్తే ఆహ్లాదంగా ఉంటుంది.

హనుమల్ల శ్రీనివాస్‌రెడ్డి, స్థానికుడు



ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరించరూ..

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామ శివారులోని సంగెం దారి పోచమ్మ గుడి సమీపంలో పది రోజుల క్రితం ఈదురుగాలులకు చెట్టు కూలి 11 కేవీ విద్యుత్ తీగలపై పడటంతో తీగలు తెగిపోయాయి. దీంతో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద 25 మంది రైతులు సుమారు 100 ఎకరాల్లో పొలాలు సాగు చేస్తుంటారు. వర్షాకాలం సాగు సీజన్ ప్రారంభం కావటంతో రైతులు దుక్కులు దున్ని నారు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. నారు పోసిన తర్వాత మోటార్లకు విద్యుత్ కావాలని విద్యుత్ అధికారులు వెంటనే తీగలు సరి చేసి ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



వేంపేటలో బడిబాటలో ఉపాధ్యాయులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేటలో బడిబాట నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు ఉచితంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేస్తున్నట్లు వారికి వివరించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నర్సయ్య,ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, శంకర్ ఉన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో శనివారం బడిబాట నిర్వహించారు. ధర్మారం అంగన్‌వాడీ కేంద్రం–2 బడిబాటను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గీత పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులను సన్మానించిన విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు తన వంతు కృషి చేస్తానని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ స్కూల్‌లో శనివారం కౌన్సిలర్ జక్కు పద్మ రవీందర్ ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పది జీపీఏ సాధించిన విద్యార్థులకు పై చదువుల విషయంలో సీట్ల కోసం తమ వంతు సాయం అందిస్తానని అంతే కాకుండా స్టడీ మెటీరియల్ అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బుగ్గారం జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, పాఠశాల యాజమాన్యం ఎస్ దినేష్, తోట శంకర్, గట్ల శ్రీనివాస్, నాయకులు చిలుముల లక్ష్మణ్ తదితరులున్నారు.

ఐకేపీ కేంద్రం, మైదానం ఏర్పాటు చేయాలని వినతి

మండలంలోని దోనూర్‌లో ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందులు పడుతున్నామని, కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, అదే విధంగా మైదానం ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా జగిత్యాల జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వొడ్నాల రాజశేఖర్ లక్ష్మణ్‌కుమార్‌ను ధర్మపురి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి జగిత్యాలలో జరగనున్న ప్రమాణ స్వీకార మహోత్సవానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో దోనూర్ గ్రామస్తులు, మున్నూరు కాపు సంఘం సభ్యులు తదితరులున్నారు.



వినతిపత్రం ఇస్తున్న దోనూర్ గ్రామస్తులు

ఆది శ్రీనివాస్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, మత్స్యకారులు

కథలాపూర్: మండలంలోని దుంపేట గ్రామశివారులో ఊర చెరువు వద్ద ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి రైతులు, మత్స్యకారులు శనివారం క్షీరాభిషేకం చేశారు. ఊర చెరువు కట్టకు గత వర్షాకాలం గండిపడింది. కట్ట మరమ్మతుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ.9.26 లక్షలు నిధులు మంజూరు చేయించగా, ఇటీవల పనులు పూర్తయ్యాయి. దీంతో సాగునీటి సమస్య తీరినట్లయిందని, చేపలు పెంచుకోవచ్చని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు ఆకుల సంతోష్, తీగల మధు, ఏలేటి లక్ష్మణ్, చెదలు రమేశ్, నరేశ్ రెడ్డి, రవి, శ్రావణ్ పాల్గొన్నారు.

రామోజీ మరణం తీరని లోటు

జగిత్యాలటౌన్: ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మరణం పత్రికా రంగానికి తీరని లోటని శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. రచయితగా సాహిత్య రంగంలో తనదైన ముద్ర వేసిన రామోజీ పాత్రికేయుడిగా, నిర్మాతగా పత్రిక, టీవీ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

భూపతిపూర్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజేత స్పోర్ట్స్ యూత్ ఆధ్వర్యంలో శనివారం గ్రామ యువతకు క్రికెట్ పోటీలు ప్రారంభించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం కోల రాజ్‌గోపాల్, ప్రతాప్, దేవేందర్, విక్రమ్, రాజశేఖర్, జయంత్, జితేందర్, నాగరాజు, సాదిక్, శశాంక్, సూర్య పాల్గొన్నారు.

పీఆర్టీయూలో చేరిన దాసరి రామస్వామి

రాయికల్: మండలంలోని భూపతిపూర్ జెడ్పీహెచ్‌ఎస్ టీచర్,టీపీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు దాసరి రామస్వామి శనివారం ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి సమక్షంలో పీఆర్టీయూలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేశ్, రాష్ట్ర కార్యదర్శి కన్నవేని మల్లారెడ్డి, పాల్గొన్నారు.

మున్నూరుకాపుల సంక్షేమానికి కృషి చేయాలి



సమావేశంలో నినాదాలు చేస్తున్న నాయకులు

మల్లాపూర్: మున్నూరుకాపుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆ సంఘం నియోజకవర్గ ఆర్గనైజర్ లైసెట్టి శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మున్నూరుకాపు సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలని, ఐక్యంగా ఉంటూ బలోపేతం కావాలని ఆకాంక్షించారు. మున్నూరుకాపు సంక్షేమ నిధిని ఏర్పాటు చేసుకోని సామాజిక కార్యక్రమాలతో పాటు నిరుపేదలైన మున్నూరుకాపు కుటుంబాలకు ఆర్థికసాయం చేయాలన్నారు. జగిత్యాలలో ఆదివారం నిర్వహించనున్న మున్నూరుకాపు ఆత్మీయ కలయ భారీ సభకు జిల్లా వ్యాప్తంగా మున్నూరుకాపులందరూ పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో మున్నూరు కాపులు కోట రమేశ్, బైన ప్రశాంత్, ఆకుల గంగాధర్, మార్గం నరేశ్, గోల్కొండ పవన్‌కుమార్, సుతారి లింగారెడ్డి, కోల రాజేందర్, దుగ్గి హనుమాండ్లు పాల్గొన్నారు.

మండలాల్లో పచ్చిరొట్ట ఎరువుల కొరత



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పచ్చిరొట్ట ఎరువుల కొరత ఎక్కువగా ఉంది. వరి పంటలో దిగుబడి పెంచేందుకు రైతులు పచ్చిరొట్ట సాగుచేస్తున్నారు. సారంగాపూర్ మండలంలో 11,500 ఎకరాలు వరి సాగుచేస్తారని అధికారులు అంచనా వేశారు. ఇందుకు 547 క్వింటాళ్ల జీలుగ, విత్తనాలు కావాలని అధికారులు ఇండెంట్ పంపించగా, ఇప్పటి వరకు కేవలం 385 క్వింటాళ్లు (1267 బస్తాలు) రాగా సింగిల్‌విండో, ఆగ్రోస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. బీర్‌పూర్ మండలంలో 13 వేల ఎకరాలు వరిసాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. వ్యవసాయశాఖ 546 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అవసరం కాగా, ఇప్పటివరకు 369 క్వింటాళ్లు వచ్చాయని, ఇంకా 177 క్వింటాళ్లు రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. దీనిపై వ్యవసాయాధికారి తిరుపతినాయక్ వివరణ ఇస్తూ రెండు రోజుల్లో సరిపడా విత్తనాలు వస్తున్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు.

మేడిపల్లి: మేడిపల్లి,భీమారం మండలాల్లో జీలుగ, జనుము కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజుల నుంచి వాతావరణంలో మార్పులతో వర్షాలు పడే ఆస్కారం ఉన్నందున రైతులు దుక్కులు దున్నుకునే ఆలోచనలో ఉండగా, జీలుగు, జనుము కోసం అడుగగా స్టాక్ అయిపోయింది అని చెప్పడంతో ప్రత్యామ్నాయల వైపు చూస్తున్నారు. ఉమ్మడి మేడిపల్లి వ్యాప్తంగా ఉన్న పోరుమల్ల, మేడిపల్లి, భీమారం, వల్లంపల్లి పీఏసీఎస్ కేంద్రాల్లో కొరత ఉంది. ఆగ్రోస్, ఫర్టిలైజర్ షాప్‌ల్లో కూడ దొరకడంలేదు. దీనిపై అధికారులను వివరణ కోరగా, ఇప్పటివరకు మండలానికి 951 క్వింటాళ్ల జీలుగ, 110 క్వింటాళ్ల జనుము రైతులకు అందించామని, మిగతా స్టాక్ త్వరలోనే రైతులకు అందుబాటులోకి తీసుకొస్తమని వ్యవసాయ అధికారి చంద్రదీపక్ తెలిపారు.

12 నుంచి ఆలయాల వార్షికోత్సవం

రాయికల్: మండలంలోని కిష్టంపేటలో లక్ష్మీవెంకటేశ్వర, భక్తమార్కండేయ, జ్ఞాన సరస్వతి ఆలయాల ప్రథమ వార్షికోత్సవాలు ఈనెల 12 నుంచి నిర్వహించనున్నారు. 12న పోచమ్మ బోనాలు, 15న స్వామివారి అభిషేకం, ధ్వజారోహణ, 16న కల్యాణ మహోత్సవం, అన్నదానం, 17న స్వామివారికి అభిషేకం, ఏకాంతసేవ, స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

పోతారంలో అగ్నిప్రమాదం

మల్యాల: ప్రమాదవశాత్తు గడ్డి కట్టలకు నిప్పంటుకుని, దగ్ధమైన ఘటన మల్యాల మండలం పోతారం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు ఎనుగంటి ప్రశాంత్‌కు చెందిన గడ్డి కట్టలకు మధ్యాహ్నం నిప్పంటుకుంది. ఈ సంఘటనలో సుమారు 1500 గడ్డికట్టలు కాలిపోగా, సుమారు రూ.10 వేల నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి, మంటలు ఆర్పివేశారు. అగ్నిమాపక సిబ్బంది ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జి.మధు, ఫైర్‌మెన్లు కె.నరేశ్, ఎం.వేణు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోరుట్ల: పట్టణ శివారులోని గుండు వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు,అభిషేకాలు నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్,సోషల్ మీడియా ఇన్‌చార్జి వాసం అజయ్, శేఖర్, సత్యం, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం గంగధరి లచ్చగౌడ్ (80) చాల కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడిన నయం కాకపోవడంతో ఆయన భార్య పోశవ్వ లచ్చగౌడ్‌ను హైదరాబాద్‌కు చికిత్స జరిపించడానికి తీసుకెళ్లాలని నిర్ణయించుకుని, దీనికి తగిన ఏర్పాట్లు చేసుకుంటుంది. కాగా పోశవ్వ ఉదయం ఉపాధిహామీ పనుల్లో పాల్గొని ఇంటికి వచ్చేసరికి లచ్చగౌడ్ ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లిలో ఓ ఇంటిలో చోరీకి పాల్పడిన బోగ సాయిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం అర్పపల్లికి చెందిన జకమకల అంజవ్వ ఇంటిలో అర్ధరాత్రి సాయి దొంగతనానికి యత్నించగా, అంజవ్వ బిగ్గరగా అరవడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు చోరీకి పాల్పడిన సాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పైపులైన్ కల్వర్టు, రహదారికి మరమ్మతు చేయాలి



కల్వర్టు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్(ఫైల్)

పెగడపల్లి: మండల కేంద్రంలోని పెగడపల్లి శివారులోని ఎగ్గలకుంట కట్ట కింద ఇటీవల కురిసిన వర్షాలకు పైపులైన్ కల్వర్టు దెబ్బతిని రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో ఈ ప్రాంత రైతులు పంట పొలాలకు రాక పోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. కనీసం నడిచి వెళ్లలేని దుస్థితి నెలకొంది. చాలా ఏళ్లుగా ఇక్కడ శాశ్వత నిర్మాణపనులు చేపట్టక పోవడంతో రైతులు ప్రతి ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఈ ప్రాంత రైతులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. పైపులైన్ కల్వర్టు, రహదారిని అడ్లూరి పరిశీలించి నిధులు మంజూరు చేయించి పనులు చేయిస్తానని, తాత్కాలికంగా మరమ్మతులు చేయించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులకు ఆయన సూచించినా మరమ్మతులు చేపట్టలేదని రైతులు పేర్కొంటున్నారు. ఎన్నికల కోడ్ తొలగిన నేపథ్యంలో వెంటనే దెబ్బతిన్న పైపులైన్ కల్వర్టు, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు జరిపించాలని విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ఘనంగా బొడ్రాయి వేడుకలు



గొల్లపల్లి: మండలంలోని భీంరాజ్‌పల్లిలో బొడ్రాయి పండుగ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పూజారి కునమల్ల తిరుపతి, పది మంది పూజార్ల బృందం ప్రత్యేక పూజలు చేశారు. డప్పు చప్పుళ్ల మధ్య ఉదయం పోచమ్మ గుడి వద్దకు ఊరేగింపుగా తరలి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ శివారులోని నాలుగు దిక్కుల పొలిమేర చుట్టూ ముడుపు కట్టారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు బొడ్రాయి వద్ద పట్నం వేసి బొమ్మల కొలువు చేపట్టి కథ చెప్పారు. రాత్రి ఊరు పొలిమేర చుట్టూ సరువు పరిచారు. గ్రామస్తులు సాంప్రదాయ రీతిలో తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.